

PRGI TGTEL /26/A1456

ప్రజాభీష్టం

# ఈమాట

తెలుగు దినపత్రిక

గురువారం

20 ఆగస్టు 2026

సంపుటి: 1
సంచిక: 113
వెల: 2-00

www.eematadaily.com | follow on: | పేజీలు: 04 | భద్రాద్రి కొత్తగూడెం



## ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

• బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి • వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి
• బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సూచన

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈమాట):

అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓఏఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు.



రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప' సిద్ధం చేయాలన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## వివాదాలను పరిష్కరించుకుందాం!

• మహాబలిపురంలో నేడు దక్షిణాది రాష్టాల సిఎంల భేటీ • చెన్నై చేరుకున్న పలువురు ముఖ్యమంత్రులు • కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన నిర్వహణ • కీలక అంశాలు ప్రస్తావించనున్న ఏపీ సీఎం చంద్రబాబు.. • విమానాశ్రయంలో చంద్రబాబుకు ఘన స్వాగతం
• ఫొటో జర్నలిస్టుగా సీఎం
• ఫొటోగ్రఫీ డే సందర్భంగా కెమెరా చేతబట్టి.. ఫొటో తీసిన సీఎం



అమరావతి/చెన్నై, ఆగస్టు 19 (ఈమాట):

దక్షిణ భారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమస్యలు, వివాదాల పరిష్కారం లక్ష్యంగా దక్షిణ ప్రాంతీయ మండలి (సదరన్ జోన్సల్ కౌన్సిల్) 31వ సమావేశం గురువారం తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీప కోవలం వద్ద జరుగనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళం, కర్ణాటక రాష్ట్రాలు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలున్న ఈ మండలికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చైర్మన్‌గా, ప్రస్తుత సమావేశానికి ఆతిథ్యమిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అమిత్‌షా అధ్యక్షతన ఓ హోటల్లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశంలో పాల్గొనేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు దక్షిణాది రాష్ట్రాల సీఎంలు బుధవారం సాయంత్రమే చెన్నైకి చేరుకున్నారు. దక్షిణభారత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమస్యలు, వివాదాలను పరిష్కరించడానికి ఈ మండలి ఒక అద్భుతమైన వేదికగా పని చేస్తుందని కేంద్రప్రభుత్వం పేర్కొంది. తమిళనాడు-కేరళ, తమిళనాడు-కర్ణాటకు, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య నదీ జలాల పంపిణీ వివాదాలు నెలకొన్న ప్రస్తుత

మిగతా 2లో..

### త్యాగం మీది.. అండ మాది

• వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం • నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన సీఎం చంద్రబాబు
• ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

7లో..


## ప్రిన్సిపాల్‌ను చంపింది విద్యార్థులే

• జల్సాల అలవాటుతో ఆమె ఇంట్లో దొగతనానికి ప్లాన్ • రూపారెడ్డి గుర్తుపట్టడంతో కిచెన్‌లో కత్తితో పొడిచి హత్య • పర్సులో డబ్బు, సెల్‌ఫోన్ తీసుకుని పరార్ • వివిధ కోణాల్లో పరిశీలించి ఇద్దరు విద్యార్థుల పట్టివేత • హత్యకేసును వివరించిన ఎస్పీ శరత్ చంద్ర

2లో..







## సినిమా థియేటర్లలో ధరలపై ప్రభుత్వం ఉత్తర్వులు

• నాన్ ఏసీ, ఏసీ, స్పెషల్, మల్టీప్లెక్స్ థియేటర్లలో ధరలు ఖరారు
• రూ.100 కోట్లు దాటితే సూపర్ హై బడ్జెట్ సినిమాగా గుర్తింపు
• ఈ సినిమాలకు తొలి 10రోజులు టికెట్ల రేట్లు పెంచుకొనే చాన్స్ • సినీ కార్మికుల నిధికి కోటి విరాళం ఇచ్చే సినిమాలకే ధరల పెంపు • రోజుకు 5 షోలకు అవకాశం.. అందులో కనీసం ఒక షో చిన్న సినిమా ఉండాలి

2లో..

## నేనున్నానని..!

• వైద్య ఖర్చులు భరిస్తానని హామీ • కుటుంబానికి ధైర్యం ఇచ్చిన సినీ హీరో • రామ్ దరికి చేరిన ఈ మాట కథనం • 'ఈమాట'కు ప్రశంసల జల్లు

### శశిభవ్య చికిత్సకు సినీ హీరో రామ్ పోతినేని చేయూత



అనపర్తి, ఈ మాట:

అరుదైన జన్యుపరమైన వ్యాధితో తీవ్ర అ నారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన దుప్పలపూడికి చెందిన 18 ఏళ్ల శశి భవ్యకు సినీ నటుడు రామ్ పోతినేని అండగా నిలిచా రు. బాలిక అనారోగ్య పరిస్థితిపై ఈమాట ప్ర ధాన శీర్షిక ద్వారా సమాచారం తెలుసుకు న్న ఆయన స్పందించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శశి భవ్యతో వీడియో కాల్‌లో మాట్లాడిన రామ్ పోతినేని ఆమెకు ధైర్యం చెబుతూ ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచించారు. తన అభిమాన హీరోతో మాట్లాడటంతో బాలిక, ఆమె తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. బాలికకు అవసరమైన మందులు, ఆహారం, వైద్యానికి సంబంధించిన ఖర్చులను తాను భరిస్తానని రామ్ హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అవసరమైతే ప్రముఖ వైద్యులను సంప్ర దించి మెరుగైన వైద్యం అందించేందు కు సహకరిస్తానని ఆయన భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. వైద్యుల సూచ నలను తప్పకుండా పాటిస్తూ బాలికను సంతోషంగా చూసుకోవాలని తల్లిదండ్రులకు

మిగతా 2లో..



# కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు



**రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

**రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం**

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఈమాట):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు‘గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు‘గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్‘భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్‘హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్‘పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించారు. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం విద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్‘సీతామర్హి‘సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

# ‘టిమ్స్’ సందర్శనకు బీఆర్ఎస్ పిలుపు

**హరీష్‌రావు, తలసాని శ్రీనివాస యాదవ్ హౌజ్ అరెస్ట్**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈమాట):

మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కోకాపేట్‌లోని హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసులను మోహరించారు. సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ సందర్శనకు హరీశ్ రావు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేయాలని కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నగరం నలువైపులా 'టిమ్స' పేరుతో సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మదు సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణ పనులకు కేసీఆర్ శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టించారు. అసెంబ్లీ ఎన్నికల సమయానికి అంటే ఏడాది కాలంలోనే అన్ని దవాఖానల నిర్మాణ పనులు 60 శాతానికిపైగా పూర్తయ్యాయి. గత సంవత్సరమే మదు సూపర్ స్పెషాలిటీ దవాఖానలు అందుబాటులోకి రావాల్సి ఉండగా, ప్రస్తుతం సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సం చేశారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు హాస్పిటల్ సందర్శనకు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. నత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అలాగే మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సనత్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని బీఆరఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. హాస్పిటల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు టిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, అడ్డుకునేందుకు తమను హౌస్ అరెస్ట్‌లు, అక్రమ నిర్బంధాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సనత్ నగర్, అవిర్‌పేట డివిజన్‌లకు చెందిన ముఖ్య నాయకులను పోలీసులు ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని తలసాని ప్రశ్నించారు.

# మా ఆదేశాలను తేలిగ్గా తీసుకోవద్దు

**అధికారులపై ఏపీ హైకోర్టు అసంతృప్తి**

అమరావతి, ఆగస్టు 19 (ఈమాట):

వివిధ కేసుల్లో కౌంటర్లు, స్థాయి నివేదికలు, మెమోలు దాఖలు చేయాలని కోరుతూ తామిచ్చే ఆదేశాలను అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాం టి అధికారుల పట్ల ఉదారంగా ఉండొద్దని అడ్వొకేట్ జనరల్ (ఏజీ), ప్రభుత్వ న్యాయవాదులకు స్పష్టం చేసింది. చాలా కేసు ల్లో కౌంటర్లు దాఖలు చేయని ఘటనలు తమ దృష్టికి తరచూ వస్తున్నాయని తెలిపింది. కేసు విచారణకు వచ్చే ముందురోజు లేదంటే అదేరోజు దాఖలు చేస్తున్నారని, ఇది సరికాదని పేర్కొం ది. సకాలంలో కౌంటర్లు, వివరాలు సమర్పించేలా చర్యలు తీసు కోవాలని, అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచిం చింది. ఏజీ స్పందిస్తూ... కౌంటర్ల దాఖలులో జాప్యం ఉద్దేశపూ ర్వకంగా చేస్తున్నది కాదన్నారు. ఈ విషయంలో మరింత సమ న్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇకపై సకా లంలో కోర్టుకు వివరాలు అందించేలా అధికారులకు సూచిస్తామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పోలీసు శాఖలో ఖాళీల భర్తీలో జరుగుతున్న జాప్యం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలపై స్థాయి నివేదిక దాఖలు చేసేందుకు చివరి అవకాశమిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

# నేనున్నానని..!

(మొదటి పేజీ తరువాయి)





సూచించారు.

**ఈమాటకు ప్రత్యేక ధన్యవాదాలు**

శశి భవ్య పరిస్థితిని ప్రజల దృష్టికి తీసుకువచ్చిన ఈమాట తెలుగు దినపత్రికకు రామ్ పోతినేని కృతజ్ఞతలు తెలిపారు. వారి ద్వారా బాలిక కుటుంబ పరిస్థితి తనకు తెలిసిందని, వారికి అండగా నిలిచే అవకాశం లభించిందని పేర్కొన్నారు. కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న శశి భవ్యకు లాఫోరా మయోక్లోనిక్ ఎపిలెప్సీ అనే అరుదైన జన్యు పరమైన వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యాధి తీవ్రత కారణంగా ఆమె మంచానికే పరిమితమై చికిత్స పొందుతోంది. ఈ క్లిష్ట సమయంలో రామ్ పోతినేని అందించిన భరోసా తమ కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. ఆయన మానవతా దృక్పథానికి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భముగా శశి భవ్య ఇంటి ప్రదేశం అంతా మీడియా రామ్ పోతినేని అభిమానులతో కోలాహాలంగా మారింది. బాలిక అనారోగ్యంపై ఈమాట తీసుకొచ్చిన ప్రధాన శీర్షిక వార్త రెండు తెలుగు రాష్ట్రాల్లో సైతం తీవ్ర సంచలనం రేపింది. ఈ విషయం సినీ నటుడు రామ్ దృష్టికి వెళ్లడం, ఆయన వెంటనే స్పందించి బాలికతో మాట్లాడటం తదితర పరిణామాలతో... ఈమాట కథనం అందర్నీ ఆకర్షించింది. ఏమాట దినపత్రిక ప్రచార కథనంపై సర్వత్ర హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

# వివాదాలను పరిష్కరించుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

తరుణంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన విస్తృత అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారని కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. జోనల్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శుల స్థాయిలో ఒక స్థాయీ కమిటీని కూడా కేంద్రం ఏర్పాటు చేసింది. రాష్ట్రాలు ప్రతిపాదించిన అంశాలను జోనల్ కౌన్సిల్ స్థాయీ కమిటీ ముందుంచుతారు. అనంతరం మిగిలిన అంశాలను పరిశీలన కోసం జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు ఉంచుతారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య పరస్పరం నెలకొన్న సమస్యల పరిష్కారానికి, వాటి పురోగతిపై చర్చించనున్నారు. మహిళలు, పిల్లలపై జరిగే అత్యాచార కేసుల దర్యాప్తు వేగవంతం, త్వరిత పరిష్కారం కోసం ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, అలాగే విద్యకు సంబంధించిన సమస్యలపైనా చర్చిస్తారు. ప్రాంతీయ స్థాయిలో ఉమ్మడి అంశాలపైనా చర్చ జరుగనుంది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించిన సమస్యలు, నీటి పంపిణీకి సంబంధించిన ముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ), పౌర విమానయానానికి సంబంధించిన సమస్యలు తదితరాలపైనా సమావేశంలో చర్చించనున్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సహకారంతో 2014 జూన్ నుంచి ఇప్పటి వరకూ వివిధ జోనల్ కౌన్సిళ్లు, వాటి స్టాండింగ్ కమిటీల సమావేశాలు మొత్తం 69 సార్లు జరిగాయని కేంద్రం పేర్కొంది. ‘రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం–1956’ లోని 15 నుంచి 22 సెక్షన్ల కింద దక్షిణ ప్రాంతీయ మండలి సహా మొత్తం ఐదు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి చెందిన కీలక అంశాలను ఈ సమావేశంలో చంద్రబాబు ప్రస్తావించనున్నారు. దక్షిణాది రాష్ట్రాల నడుమ సమన్వయం, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారంతో పాటు ఏపీ పునర్విభజన చట్టం అమలు, పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అంశాలను సీఎం లేవనెత్తనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు పూర్తవుతున్నా పునర్విభజన చట్టంలోని వివిధ అంశాలు కొలిక్కి రాలేదు. వాటిని సీఎం ప్రస్తావించనున్నారు. అలాగే, షెడ్యూల్ 9–10లోని సంస్థల విభజన, ఆస్తులు, అప్పుల పంపకం, పెండింగ్ ఆర్థిక అంశాల పరిష్కారంపై కేంద్రం చొరవ తీసుకోవాలని చంద్రబాబు కోరనున్నారు. రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలనూ ప్రస్తావించే అవకాశం ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, దుగరాజపట్నం పోర్టు, విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టులు, రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధి, పారిశ్రామిక కారిడార్ల వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు వంటి అంశాల్లో కేంద్రం సహకారానికి కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. అదే సమయంలో మిగిలిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు, నిధులు ఇవ్వాలని కోరనున్నారు.

**చంద్రబాబుకు ఘన స్వాగతం**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం సాయంత్రం విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఆయన చెన్నై చేరుకున్నారు. చెన్నై విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నేతలు చంద్రశేఖర్, రవిబాబు తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నేరుగా సమావేశం జరిగే హోటల్‌కు ఆయన బయలుదేరి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కర్ణాటక సీఎం శివకుమార్, కేరళ సీఎం సతీశన్, ఆయా రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు కూడా వేర్వేరుగా సమావేశ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడే అమిత్‌షాతో ముఖ్యమంత్రులు వేర్వేరుగా భేటీ అయినట్లు తెలిసింది.

**ఫొటో జర్నలిస్టుగా సీఎం**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటో జర్నలిస్టులకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ, జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు అభినందనలు అని సీఎం పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో తనను కలిసేందుకు వచ్చిన ఫొటోగ్రాఫర్లతో సీఎం సరదాగా ముచ్చటించారు. ఫొటోగ్రాఫర్ నుంచి కెమెరా తీసుకుని, ఫొటో జర్నలిస్టుగా మారి ఫొటోగ్రాఫర్లను గ్రూప్ ఫొటో తీశారు. పేరుపేరునా అందరినీ పలుకరించి వారితో విడివిడిగా ఫొటోలు దిగారు.

# ఏపీలో పురపాలక ఎన్నికలకు రంగం సిద్ధం

**87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహణ**

అమరావతి, ఆగస్టు 19 (ఈమాట):

ఏపీలో పురపాలక ఎన్నికల నిర్వహణలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేస్తూ ముందుకెళ్లనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్, సంచాలకులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీ కాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల కూడా ఇప్పుడే ఎన్నికలు జరపనున్నారు. న్యాయపరమైన వివాదాలు, ఇతర సమస్యల కారణంగా మిగిలిన 23 పురపాలక సంఘాల్లో ప్రస్తుతానికి ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం తాజా మార్గదర్శకాల ప్రకారం.. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు కావాలంటే ప్రజలతో ఎన్నికైన పాలకవర్గం తప్పనిసరి. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోతే పట్టణ స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు ఆగిపోయే ప్రమాదముంది. రాజ్యాంగబద్ధమైన పాలనతో పాటు, ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నికల పక్రియను వేగవంతం చేసింది. ఈ పక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘంతో పూర్తిస్థాయిలో సమన్వయం చేసుకోవాలని పురపాలక శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట

**ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈమాట):

అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎసఐఆర్ సర్‘2026పై ఆయన కీలక సవిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆరఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు. అనామలీస్, నో‘ మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. ంSఆఅ జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు ఫారం 6, 60, 7, 8పై ‘లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చేయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో‘ మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

**భూసేకరణలో బాధితులను పట్టించుకోరా?**

**కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈమాట):

ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# సినిమా థియేటర్లలో ధరలపై ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఈమాట):

తెలంగాణలో సినిమా టికెట్ ధరలు, థియేటర్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్, స్పెషల్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో నిర్దిష్టమైన టికెట్ ధరలను ఖరారు చేస్తూ హోంశాఖ జీవో ఎంఎస్ నెం. 77 జారీ చేసింది. 2021 తర్వాత సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ల ధరలను పెంచారు. మల్టీప్లెక్స్‌లలో ధరలను యథాతథంగా ఉంచారు. స్పెషల్ థియేటర్లు అనేదానికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. 7.1 సరౌండ్ సౌండ్ సిస్టమ్, 2కే లేదా 4కే ప్రొజెక్షన్, కనీసం 75 అడుగుల తెర ఉన్న థియేటర్లను స్పెషల్ క్యాటగిరీలో చేర్చింది. ఉదయం 8 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు రోజుకు 5 షోలు ప్రదర్శించుకొనేందుకు అనుమతి ఇచ్చింది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల మధ్య ఒక చిన్న సినిమాను ప్రదర్శించేందుకు అవకాశం ఇవ్వాలని ఆదేశించింది. రూ.100 కోట్లకుపైగా బడ్జెట్‌తో తీసే సినిమాలను సూపర్ హై బడ్జెట్ సినిమాలుగా గుర్తిస్తున్నట్లు పేర్కొంది. ఇలాంటి సినిమాలకు మొదటి పది రోజులు మాత్రమే టికెట్ ధరలు పెంచుకొనేందుకు అవకాశం ఇచ్చింది. అది కూడా సినీ కార్మికుల సంక్షేమ నిధికి రూ.కోటి విరాళం ఇచ్చే సినిమాలకు మాత్రమే టికెట్ ధరలు పెంచుకొనేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అయితే, ఎంతమేర టికెట్ ధరలు పెంచుకోవచ్చన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. ఆన్‌లైన్‌లో బుక్‌చేసే టికెట్లకు ఏసీ థియేటర్ అయితే రూ.5, నాన్ ఏసీ థియేటర్ అయితే రూ.3 చొప్పున నిర్వహణ చార్జీలుగా నిర్ణయించింది. కాగా, టికెట్ ధరల పెంపుతో అదనపు ఆదాయం సమకూర్చుకున్న నాలుగు సినిమాల నిర్మాతలు తమ అదనపు ఆదాయం నుంచి 20శాతం డబ్బును తెలుగు సినీ పరిశ్రమ కార్మికుల సంక్షేమ నిధికి చెల్లించాల్సిందిగా ఆయా సినీ నిర్మాణ సంస్థలకు ప్రభుత్వం లేఖలు పంపింది. అఖండ–2, ది రాజాసాబ్, మన శంకర్ వరప్రసాద్ గారు, పెద్ది సినిమా టికెట్ ధరల పెంపుతో వచ్చిన అదనపు ఆదాయంపై సంక్షేమ విరాళంగా ఇవ్వాలని లేఖలో పేర్కొంది. నాన్ ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం క్యాటగిరీ టికెట్ ధర కనిష్ఠంగా రూ. 30, గరిష్ఠంగా రూ.70. ప్రీమియం టికెట్ల ధర కనిష్ఠంగా రూ. 50, గరిష్ఠంగా రూ. 100. ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియంలో కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ. 150. ఏసీ థియేటర్లలో ప్రీమియంలో కనిష్ఠంగా రూ.100, గరిష్ఠ ధర రూ. 200. స్పెషల్ థియేటర్లలో నాన్ ప్రీమియంలో కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ. 250. ప్రీమియం, రిక్లైనర్ కనిష్ఠ ధర రూ.200, గరిష్ఠ ధర రూ.300. మల్టీప్లెక్స్‌లు రెగ్యులర్ కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.250, రిక్లైనర్ కనిష్ఠం రూ. 200, గరిష్ఠ ధర రూ.300.




# ప్రిన్సిపాల్‌ను చంపింది విద్యార్థులే

నల్గొండ, ఆగస్టు 19 (ఈమాట):

సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు చేసిన ఘాతుకమని వెలిపారు. ఆ ఇద్దరు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన విడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మదు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. రూపారెడ్డి నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారని ఎస్పీ3 వివరించారురు. సవిపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం అని ఎస్పీ వివరించారు.

Follow:
https:// www.eemaata.com
ప్రజాభీష్టం ఈమాట
భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం
గురువారం
ఆగస్టు, 20, 2026




## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

పినపాక-ఈమాట:

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను కొత్తగూడెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కీసర సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సంఘటనలు, ప్రకృతి, చారిత్రక విశేషాలను భావితరాలకు అందించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర కీలకమన్నారు. ఏఐతో ఫోటోగ్రఫీలో మార్పులు వస్తున్నందున కొత్త సాంకేతికతను నేర్చుకోవాలని సూచించారు. పేద ఫోటోగ్రాఫర్లకు వడ్డీలేని రుణాలు, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, కొత్తగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి తెలంగాణ శంకర్, కోశాధికారి ప్రభాకర్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు పాపారావు, మస్తాన్, ప్రేమ్, ప్రేమి శ్రీను, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్య నాటకోత్సవాలకు ఆహ్వానం

భద్రాచలం-ఈమాట:

సామాజిక ఉద్యమ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాబృందం నిర్వహించే సామాజిక చైతన్య నాటకోత్సవాలు ఆగస్టు 20, 21 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో జరగనున్నాయి. ఆగస్టు 20న "సంఘం శరణం గచ్ఛామి" నాటకం ప్రదర్శించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాల ఆధారంగా దీనిని రూపొందించారు. ఆగస్టు 21న "సత్యశోధన" నాటకం ప్రదర్శించనున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవితాల ఆధారంగా నాటకాన్ని రూపొందించారు. రెండు రోజులూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శనలు ఉంటాయి. కే. దేవేంద్ర రచన, శివ ప్రసాద్ తూము దర్శకత్వం వహిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాటకోత్సవాలను విజయవంతం చేయాలని సామాజిక ఉద్యమకారులు, మాజీ ఎంఆర్‌పీఎస్ నేత అలవాల రాజా పెరియార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీంద్ర కోరారు.



## ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

బూర్గంపహాడ్-ఈమాట:

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఉపసర్పంచ్ గుండె వెంకన్న పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటగది పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నందున మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించాలని ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బందికి సూచించారు. భోజనం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. విద్యార్థులతో మాట్లాడి మంచినీరు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, వసతి తదితర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలోని సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమ పథకాలు రద్దు చేస్తే

# ప్రజా ప్రతిఘటన తప్పదు

- బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు మానే రామకృష్ణ
- బీఆర్ఎస్ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

దుమ్ముగూడెం-ఈమాట:



పేదల సంక్షేమ పథకాలను రద్దు చేస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు మానే రామకృష్ణ హెచ్చరించారు. సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్ దుమ్ముగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ భరణి బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానే రామకృష్ణ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. తాలిపేరు ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేపట్టి ఏజెన్సీలో వ్యవసాయాన్ని ఆదుకోవాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కణితి రాముడు, కో-కన్వీనర్ ఎండీ జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్షి , మోతుకూరి రజిని, కొత్తూరు సీతారామారావు, అపకా వీరాజు, తునికి కామేశ్వరరావు, బొల్లి వెంకట్రావు, కాల్వ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాసరావు; ప్రజాప్రతినిధులు వాగే ఖాదర్‌బాబు, గుండి రవి, మడకం జోగయ్య; నాయకులు తంతరపల్లి వెంకటేశ్వరరావు, గోసంగి కిరణ్, లంక శివ, వాగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించకుంటే

## సమ్మెకు దిగుతాం

రామవరం-ఈమాట:



సింగరేణి కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించకుంటే అన్ని సంఘాలతో కలిసి సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. పీవీకే-5 గని వద్ద గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ పెర్క్స్ ఆదాయపన్ను సమస్య పరిష్కారం, సింగరేణి లాభాల్లో కార్మికులకు 40 శాతం వాటా, ప్రభుత్వ బకాయిలు రూ.56 వేల కోట్లు చెల్లింపు, కొత్త గనుల ప్రారంభం, మెరుగైన వేతనాలు, భద్రతా పరికరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులకు ప్రతి నెలా వైద్య మండలి నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించడం ఏఐటీయూసీ పోరాట ఫలితమన్నారు. అనంతరం జీఎం వెంకట రమణను కలిసి పీవీకే-5 గని వెంటిలేషన్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, ఏరియా ఉపాధ్యక్షుడు కత్తెర్ల రాములు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, మధుకృష్ణ, సౌజన్య, సాయి పవన్, రామచందర్, సుమన్, ఎస్.రమేష్, నరేందర్, సురేందర్‌రెడ్డి, సంజీవ్, ప్రశాంత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

- సబ్‌కలెక్టర్ మృనాల శ్రేష్ఠ

భద్రాచలం-ఈమాట:



కళాశాల పరిశుభ్రత, విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృనాల శ్రేష్ఠ సూచించారు. బుధవారం మదర్ తెరిసా ప్రాంగణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన తరగతి గదులు, వసతి గదులు, భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో పాఠ్యాంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ మెనూ ప్రకారం తాజా కూరగాయలతో వంట చేసి వేడిగా ఉన్నప్పుడే సమయానికి ఆహారం అందించాలని ఆదేశించారు. వంట సిబ్బంది పరిశుభ్రత పాటిస్తూ వంటగదిని శుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త, పిచ్చిమొక్కలు, కాలువల్లో పూడిక తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు ఏఎన్ఎం 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. కళాశాల భద్రతకు వాచ్‌మన్ 24 గంటలు విధుల్లో ఉండేలా చూడాలని, అనుమతి లేకుండా బయటి వ్యక్తులను లోపలికి అనుమతించవద్దన్నారు. రాత్రివేళ విద్యార్థినులు బయటకు వెళ్లకూడదని సూచించారు. మిషన్ భగీరథ నీటిని క్రమం తప్పకుండా పరీక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వార్డెన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్

## పథకాలను కొనసాగించాలి

- బీఆర్ఎస్ అశ్వాపురం మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ

అశ్వాపురం-ఈమాట:



కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను కొనసాగిస్తూ, పెండింగ్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు అందించాలని బీఆర్ఎస్ అశ్వాపురం మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను నిలిపివేస్తే ప్రజల తరఫున పోరాడుతామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం మండల యువజన అధ్యక్షుడు రంజిత్‌కుమార్, అశ్వాపురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చల్లా రాజేష్, మండల యువజన ఉపాధ్యక్షుడు రాసాల రమేష్, గొల్లగూడెం సర్పంచ్ కొండ్రు సమ్మయ్య, మండల బీసీ సెల్ అధ్యక్షుడు అరసవెల్లి పవన్, యువజన నాయకులు మంగళగిరి రామకృష్ణ, జావిద్ పాల్గొన్నారు.

### రేగా కాంతారావుపై

## కేసు కొట్టివేతపై హర్షం

- రాజకీయ కక్షతోనే మాజీ ఎమ్మెల్యేపై కేసు
- అసత్య ప్రచారాలన్నిటికీ కోర్టు తీర్పుతో చెక్
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారావు

ఆళ్లపల్లి-ఈమాట:



మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేయడం హర్షణీయమని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు అన్నారు. ఆళ్లపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు రాజకీయ కక్షతోనే నమోదైందని మొదటి నుంచి చెబుతున్నామని, హైకోర్టు తీర్పుతో తమ వాదనకు బలం చేకూరిందన్నారు. సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో జరిగిన అసత్య ప్రచారాలకు తీర్పుతో చెక్ పడిందని, నిజం ఎప్పటికైనా గెలుస్తుందని పేర్కొన్నారు.

### బాల్యతండా బూత్‌లో

## 'సర్' ప్రక్రియ పరిశీలన

చండ్రుగొండ-ఈమాట:

పోకలగూడెం పంచాయతీ బాల్యతండా 48వ బూత్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, 48వ బూత్ బీఎల్ఏ ఇస్లావత్ సాయిరాం నాయక్ పరిశీలించారు. మండల బీఎల్ఓ కో-ఆర్డినేటర్ మేదరాజుల దిలీప్ ఆదేశాలతో బూత్ బీఎల్ఓ ఇస్లావత్ నాయక్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రక్రియ నిర్వహించారు. బూత్‌లో మొత్తం 912 ఓట్లకు గాను 864 క్రియాశీల ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 440 మంది పురుషులు, 424 మంది మహిళలు ఉన్నారు. మరో 13 ఓట్లు బదిలీ, 21 డబుల్, 11 మరణించిన, 3 ఆచూకీ లేని ఓట్లుగా గుర్తించినట్లు బీఎల్ఓ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ న్యాయబద్ధంగా, పారదర్శకంగా జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని బూత్ బీఎల్ఏ ఇస్లావత్ సాయిరాం నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రతిభకు దక్కిన గౌరవం

దుమ్ముగూడెం-ఈమాట:

ఫోటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న లోహిత డిజిటల్స్ ప్రముఖ ఫోటోగ్రాఫర్ పూదోట కృష్ణవేణిని ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోఆర్డినేటర్ కనుబుద్ది దేవా శాలువాతో ఘనంగా సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని నిరూపిస్తూ ఫోటోగ్రఫీలో కృష్ణవేణి అందిస్తున్న సేవలు అభినందనీయమని దేవా పేర్కొన్నారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జిల్లా కార్యదర్శి లంక అబ్బులు, బైరెడ్డి సీతారామరావు, లంక రాంప్రసాద్, వాసం రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ముసాయిదా ఓటర్ల

## జాబితా ప్రదర్శన

సారపాక-ఈమాట:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను సారపాక పంచాయతీ నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు జాబితా లో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని కోరారు.



### భద్రగిరి మార్ట్ లో పీఓ రాహుల్

## పుట్టినరోజు వేడుకలు

భద్రాచలం-ఈమాట:

భద్రగిరి మార్ట్‌లో ఐటీడీఏ పీఓ బి. రాహుల్ పుట్టినరోజు వేడుకలను మార్ట్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. పీఓ రాహుల్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించిన ఆయన, ఇదే ఉత్సాహంతో కస్టమర్లను మర్యాదగా ఆహ్వానించి విక్రయాలు పెంచి మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ జయరాజ్, సిబ్బంది భూదేవి, శశికళ, భవ్య, రమ్య, ఝూన్సీ, శివ, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి సీతారాముడి సన్నిధిలో

## లండన్ ప్రవాసి పూజలు

- నిత్య అన్నదానానికి రూ.50 వేల విరాళం అందజేత
- కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి దర్శనం

భద్రాచలం –ఈమాట:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఏపీలోని విజయవాడకు చెందిన, ఉద్యోగరీత్యా లండన్‌లో నివసిస్తున్న మొగిలినేని గగన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సం దర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.50 వేల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసి తన భక్తి, సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ.. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగిస్తూ భక్తులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్వస్థలం, ఆధ్యాత్మిక క్షేత్రాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలకు సహకరించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ) సాయిబాబు, రఘునాథ్, గగన్‌కుమార్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభీష్టం ఈమాట

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం

Follow:
https://www.eemaata.com

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను కొనసాగించాలి

## బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

చర్ల-ఈమాట:

కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ పేద ఆడబిడ్డల వివాహాలకు, రైతులకు అండగా నిలుస్తున్న సంక్షేమ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదన్నారు. పెండింగ్ లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందించాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం, ఆడబిడ్డల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో-కన్వీనర్ అయినవోలు పవన్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, సీనియర్ నాయకులు తోటపల్లి మాధవరావు, పెద్ద బుజ్జి, గొర్ల రాజబాబు, జోగిరాజు, కుదునూరు రాము, దినసరపు భాస్కర్‌రెడ్డి, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, కొంబత్తిని రాము, బొజ్జ సాయి, ప్రణయ్ (బాచి), అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, కుప్పాల సౌజన్య, బేతంచర్ల నర్సవేణి, సర్పంచులు సోయం నాగలక్ష్మి (ఉప్పరిగూడెం), బెండబోయిన సుహాసిని (పెద్ద మిసీలేరు), కుంజా కమల (కుదునూరు), అలాగే కట్టం కన్నారావు, కారం కన్నారావు, సాదిక్, తెల్లం లక్ష్మీనారాయణ,





సింగ సంతోష్, పాసిగంటి సంతోష్, సంతపూరి సతీష్, సృజన్, కుక్కడపు సాయి, మామిడి రాజు, తడికల చంద్రశేఖర్, కొంగూరి సోమరాజు, బట్ట కొమరయ్య, గుమ్మల నరేంద్ర తదితర నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళా సమస్యలపై ఉద్యమించాలి

భద్రాచలం-ఈమాట:

మహిళా సమస్యలపై నిరంతరం పోరాడిన వట్టికొండ విజయలక్ష్మి స్ఫూర్తితో మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఐద్వా పట్టణ కార్యదర్శి డి. సీతాలక్ష్మి, సీనియర్ నాయకురాలు నాదెండ్ల లీలావతి పిలుపునిచ్చారు. ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షురాలు జీవనజ్యోతి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన విజయలక్ష్మి వర్ధంతి సభలో వారు మాట్లాడారు. ముందుగా విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సమస్యలను విస్మరిస్తున్నాయని వారు విమర్శించారు. మహిళా హక్కుల సాధనకు నిరంతర పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎం. సుబ్బలక్ష్మి, గడ్డం నాగలక్ష్మి, డి. నాగలక్ష్మి, సుభద్ర, లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

చర్ల-ఈమాట:



ఆదివాసీ హక్కులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణతో పాటు భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు డిమాండ్‌తో సొందే వీరయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర తెలిపారు. 1/70 చట్టం, ఐదో షెడ్యూల్, పీసా, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ఆదివాసీ యువత, నిరుద్యోగ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 20న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద జరిగే పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి ఆదివాసీ యువత, విద్యార్థులు, మహిళలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. "ఆదివాసుల ఐక్యతే బలం.. రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యం" అనే నినాదంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇరప రాజుదొర కోరారు.



## చండ్రుగొండలో ఏజెన్సీ బంద్ విజయవంతం

చండ్రుగొండ-ఈమాట:

ఆదివాసీల ఉద్యోగ, చట్టపరమైన హక్కుల పరిరక్షణకు తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపుతో చేపట్టిన ఏజెన్సీ బంద్ చండ్రుగొండలో విజయవంతమైంది. విద్యాసంస్థలు బంద్ పాటించగా, వివిధ గ్రామాల ఆదివాసీ నాయకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన ఆదివాసీల ప్రత్యేక హక్కులు, రక్షణలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మహిళా జిల్లా అధ్యక్షురాలు పాయం మాధవి, మండల అధ్యక్షుడు కొడెం నరసింహారావు, ఉపాధ్యక్షులు కుంజా వెంకటేష్ దొర, అద్దం రమేష్, బొర్రా సురేష్, చీదర నవీన్, కారం నాగేంద్రబాబు, పునెం కిరణ్, కణితి అశోక్, కారం అన్వేష్, పదం నరసింహారావు, కాక నరసింహారావు, కాక ముల్లప్ప, తోలెం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్య పాఠశాల ముందు ఆదివాసీల నిరసన

గుండాల-ఈమాట:

ఏకలవ్య పాఠశాలలో జరిగిన ఘటనకు బాధ్యులైన ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ నాయకుల పిలుపుతో గుండాల మండల కేంద్రంలో బుధవారం బంద్ నిర్వహించారు. పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపాయి. అనంతరం ఏకలవ్య పాఠశాల ఎదుట తీవ్ర ఉద్రిక్తతల నడుమ నిరసన చేపట్టారు. జీఓ–3ను పునరుద్ధరించాలని, ఘటనపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెం వెంకటేశ్వర్లు, పినపాక జాయింట్ యాక్షన్ కమిటీ మండల అధ్యక్షుడు వెంకట్, పెండకట్ల నాగరాజు, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు అలెం కోటి, మోకాళ్ల వీరస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ నామాను కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు



చండ్రుగొండ-ఈమాట:

కొత్తగూడెం పర్యటనకు వచ్చిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నాయకుడు నామా నాగేశ్వరరావును అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చండ్రుగొండ మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావుకు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు నల్లమోతుల వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడ మోహన్‌రావు, భూపతి రమేష్, మండల నాయకులు ఇమ్మడి ముత్తేశ్వరరావు, ఎస్‌కే అబ్బాస్ అలీ, గాలం రవి, మంద అనిల్, కిక్కర్ల వెంకటేశ్వర్లు తదితరులు.

## మొక్కలు నాటి.. పచ్చని భద్రాచలం నిర్మిద్దాం

- ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం-ఈమాట:

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి భవిష్యత్ తరాలకు పచ్చని భద్రాచలాన్ని అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ పిలుపునిచ్చారు. భద్రాచలం పాత మార్కెట్ సెంటర్‌లోని భద్రాద్రి గిరిజన మార్ట్ ప్రాంగణంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పీఓ రాహుల్ పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భద్రాచలాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి భూక్యా రంజిత్‌నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్‌రెడ్డి, గొల్ల భూపతి



రావు, వ్యవస్థాపక సభ్యులు జి. రాజారెడ్డి, గంగాధర వీరయ్య, కృష్ణార్జునరావు, డాక్టర్ కృష్ణప్రసాద్, తుమ్మలపల్లి సావిత్రి, లక్ష్మి, తులసి, పూసం రవికుమారి, పద్మ, పద్మావతి, పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐటీడీఏ పీవో రాహుల్ జన్మదిన వేడుకలు

భద్రాచలం ఐటీడీఏ-ఈమాట:

భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ 33వ జన్మదిన వేడుకలను ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమం, సంస్కృతి పరిరక్షణతో పాటు గిరిజన మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు భద్రగిరి మార్ట్, గిరిజన మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయడం, కోయ భాషకు ప్రాధాన్యత కల్పించడం వంటి కార్యక్రమాలను అధికారులు ప్రశంసించారు. భద్రాచలం ఐటీడీఏకు జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో ఆయన కృషిని అభినందించారు. అనంతరం అధికారులు, సిబ్బంది రాహుల్‌ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ఆనంద్‌కుమార్, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, హెచ్ఎన్‌టీసీ ఉదయ్‌కుమార్, ఏఏవో సంతోష్, ఏటీడీవో రాధమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



# రేగా కాంతారావుకు హైకోర్టులో ఊరట

కరకగూడెం-ఈమాట:

పినపాక మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంతో కరకగూడెంలో బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం సంబరాలు జరుపుకున్నాయి. మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య మాట్లాడుతూ తప్పుడు కేసును హైకోర్టు కొట్టివేయడం న్యాయం గెలిచినట్లేనన్నారు. ప్రభుత్వం కక్షపూరితంగా కేసులు పెట్టే విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది ఎం. సాంబశివరావు కేసు కొట్టివేత విషయాన్ని వెల్లడించడంతో జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొమరం సత్యనారాయణ, నాయకులు కొమరం రాంబాబు, ఊకే రామనాథం, రేగా సత్యనారాయణ, అక్కిరెడ్డి వెంకటరెడ్డి, షౌందు పాషా, కటకం లెలిన్, ఎగ్గడి శ్రీనివాస్, గాందర్ల సత్తీష్ పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

పినపాక-ఈమాట:

పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేయడంతో పినపాకలో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మండల కేంద్రం ప్రధాన రహదారి, బయ్యారం అడ్డరోడ్డులోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. రేగా కాంతారావుకు మద్దతుగా నినాదాలు చేశారు. హైకోర్టు తీర్పు సంతోషకరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## గిరిజన బీఈడీ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

- ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం ఐటీడీఏ-ఈమాట:



భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలోని ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో 2026–28 విద్యా సంవత్సరానికి 28వ బ్యాచ్ రెగ్యులర్ బీఈడీ ప్రవేశ దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంతాలకు చెందిన తెలంగాణ గిరిజన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలి. డిగ్రీ మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరీలో సీట్లు రిజర్వు చేసినట్లు తెలిపారు. మొత్తం 100 సీట్లు ఉన్నాయి. దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలతో పాటు ఏటూరునాగారం, ఉట్నూరు, మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాల్లో ఉచితంగా పొందవచ్చన్నారు. వివరాలకు 8247528404, 8247798370, 9912272959, 9959575539 నంబర్లను సంప్రదించాలని పీవో కోరారు.



## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కరకగూడెం-ఈమాట:

పద్మాపురం గ్రామపంచాయతీ పరిధి నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామంలో ఆధార్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ విద్యార్థులకు విద్యా, పరిశుభ్రత సామగ్రిని సంస్థ వ్యవస్థాపకుడు తోలెం రమేష్ బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు క్లాత్ బ్యాగులు, నోట్‌బుక్స్, సబ్బులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, దువ్వెనలు, నెయిల్ కటర్లు అందజేశారు. ఈ సందర్భంగా తోలెం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాల, అంగన్వాడీకి హాజరై ఉన్నత విద్య అభ్యసించాలని ఆకాంక్షించారు. పిల్లల విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధార్ సంస్థ వాలంటీర్ ఈసం రాజబాబు, పాఠశాల ఉపాధ్యాయుడు ఊకే రామస్వామి, అంగన్వాడీ టీచర్ స్వర్ణలత, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీపీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

ములకలపల్లి-ఈమాట:

గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరాహారదీక్షలు రెండో రోజుకు చేరాయి. అనంతరం ఎంపీడీవో ఎస్.వి. సత్యనారాయణ, ఎంపీఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని గంటా శ్రీనివాసరావు కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు మాట్లాడుతూ కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, జీఓ నం.51 రద్దు చేయాలని, మృతిచెందిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.30 వేల సాయం, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నెలవారీ వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా ఖాతాల్లో జమ చేయాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని




ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వర్క రుక్మధరావు, గద్దల మహేష్, గుగులోతు శంకర్, మేకల రమేష్, బొమ్మగాని శంకర్, సాయి రత్న, సుజాత, యేసుబాబు, కొక్కెరగడ్డ సతీష్, వగ్గేల ధారయ్య, సున్నం నవీన్, పొట్టా రాము, కుంజా శ్రీను, పొక్కిలి నరేష్, సోయం పాపారావు, నాగరాజు, సాగర్, కృష్ణ, వెంకటేశ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ బుకింగ్ పాత విధానాన్నే కొనసాగించాలి

**గోకవరం–ఈమాట:**
వంటగ్యాస్ బుకింగ్ విధానంలో ఇటీవల వచ్చిన మార్పుల వల్ల మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దళిత నేత వరసాల ప్రసాద్ ఆరోపించారు. గతంలో ఉన్న విధంగా 30 రోజులకు ఒకసారి గ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యపై గోకవరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వరసాల ప్రసాద్ స్థానికులతో కలిసి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పినిశెట్టి రామకృష్ణకు అందజేశారు ఈ సందర్భంగా వరసాల ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో 30 రోజులకు ఒకసారి వంటగ్యాస్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం 45 రోజుల తర్వాతే బుకింగ్ చేసుకునే విధానం అమల్లోకి రావడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సాధారణంగా ఒక గ్యాస్ సిలిండర్ నెల రోజుల్లోనే పూర్తవుతుందని, అలాంటప్పుడు మరో సిలిండర్ కోసం 45 రోజుల వరకు వేచి ఉండాల్సి రావడం కుటుంబాలకు భారంగా మారుతోందని పేర్కొన్నారు. కట్టెలు, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో వంటగ్యాస్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**అనపర్తి–ఈమాట:**
అనపర్తి నియోజకవర్గ అనపర్తి ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి సంఘం ట్రెజరర్ నాగలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నాయకులు, సభ్యులు డాగురె చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సంక్షేమ సంఘం నాయకులు, సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ చేసినారు, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ, ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, కాలాన్ని, సంఘటనలను, మనుషుల జ్ఞాపకాలను భద్రపరిచే గొప్ప కళ అని అన్నారు. సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రఫీ రంగంలో అనేక మార్పులు వచ్చినప్పటికీ, ఫోటోగ్రాఫర్ సృజనాత్మకతకు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు సంఘం సెక్రటరీ మహేష్ మాట్లాడుతూ, ఒక ఫోటోగ్రాఫర్ తీసిన ఒక్క చిత్రం ఎన్నో సంవత్సరాల తర్వాత కూడా ఒక సంఘటనను కళ్లముందు నిలబెట్టే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియోగ్రఫీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు నరసింహారావు, అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ మహేష్, ట్రెజరర్ నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీ శ్రీహరి, శివ సుబ్రహ్మణ్యం, శ్రీను, స్వామి, రవి, మణికుమార్, సుబ్రహ్మణ్యం, చైతు, శేఖరు, సరిత, వనజ తదితర ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదివాసీలకు వందశాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయాలి



**చింతూరు–ఈమాట:**
ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించేలా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. 1/70 చట్టం పరిరక్షణకు సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని కోరింది. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం చింతూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఒకరోజు నిరాహారదీక్షను సీనియర్ ఉపాధ్యాయుడు పండ కృష్ణయ్య, ఆదివాసీ మహిళా నాయకురాలు కారం సంకురమ్మ, సీఐటీయూ మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ ప్రారంభించారు. పండ కృష్ణయ్య మాట్లాడుతూ జీఓ–3 ద్వారా కల్పించిన 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ 2020లో రద్దయిందని, దాని పునరుద్ధరణకు ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా నాయకుడు సిసం సురేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని డిమాండ్ చేశారు. చింతూరు ఆదివాసీ జేఏసీ నాయకులు జల్లి నరేష్, పొడియం రామకృష్ణ, కాకా సీతారామయ్య, మడివి రాజు, సాయిబాబు, పొడియం లక్ష్మణ్ పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, సోడే లెనిన్, గుర్రం పిడకయ్య, మడకం కన్నయ్య, బడుగు కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీని కమ్మేసిన పిచ్చిమొక్కలు.. మురుగునీరు పారేదెలా?





**చింతూరు–ఈమాట:**
మండల కేంద్రంలోని గుబ్బెలిపేట సీసీ రోడ్డు డ్రైనేజీ పిచ్చిమొక్కలతో పూర్తిగా కమ్ముకుపోయింది. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో విషసర్పాలు, తేళ్లకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల భయం నెలకొంది. ఇటీవల డెంగీతో ఒకరు మృతి చెందిన నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో డ్రైనేజీ చుట్టూ క్రిమికీటకాల భయంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే పిచ్చిమొక్కలు, వ్యర్థాలు తొలగించి డ్రైనేజీని శుభ్రం చేసి, మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రాజకీయాల్లో విలువలకు పెద్దపీట సత్తి వీరు రెడ్డి సేవలు చిరస్మరణీయం



**అనపర్తి–ఈమాట:**
రాజకీయాల్లో నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజాసేవ చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ సత్తి వీర్రెడ్డి అని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. రామవరం గ్రామంలో బుధవారం స్వర్గీయ సత్తి వీర్రెడ్డి ఆరో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంస్య విగ్రహానికి కుమారులు, విశాఖపట్నం గౌతమి సంస్థల అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రామవరం, అనపర్తి పరిసర గ్రామాల్లో 'రాయవరం మనసబు'గా పేరొందిన వ్యక్తి శిష్యుడిగా సత్తి వీర్రెడ్డి రాజకీయ రంగ ప్రవేశం చేశారని తెలిపారు. రాజకీయాల్లో నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ ప్రజల కోసం పనిచేశారని కొనియాడారు. ఆయన పాటించిన విలువలు, ప్రజలతో ఉన్న అనుబంధమే అనేక చారిత్రాత్మక విజయాలను అందించాయని పేర్కొన్నారు. సత్తి వీర్రెడ్డి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా, రామవరం గ్రామ సర్పంచ్‌గా, సీడీసీ చైర్మన్‌గా, రామవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పలు కీలక పదవులు చేపట్టి ప్రజలకు, రైతులకు సేవలందించారని కృష్ణారెడ్డి తెలిపారు. పదవుల్లో ఉన్న సమయంలో చేసిన సేవలతో రైతుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నల్లమిల్లి వెంకటరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు కోనాల సోమసుందరరెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, సత్తి రామారెడ్డి, పార్టీ నాయకులు కర్రి గాంధీరెడ్డి, ఎన్‌వీవీ సత్యనారాయణరెడ్డి, సత్తి పోతారెడ్డి, కర్రి గోపాల్‌రెడ్డి, లంక పెదసత్యనారాయణ, లంక శ్రీను, యార్లగడ్డ నాగేష్ తదితరులు పాల్గొన్నారు. సత్తి వీర్రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.




## వర్షాలతో దెబ్బతిన్న గిరిజన కుటుంబానికి సాయం

**చింతూరు–ఈమాట:**
భారీ వర్షాలతో దెబ్బతిన్న గిరిజన మహిళ పాయం దేవి కుటుంబానికి చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడు, జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్‌ఖాన్ అండగా నిలిచారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన రేకులు, పైపులను ట్రస్ట్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అబ్రారులాక్, షరీఫ్ పాల్గొన్నారు. తమకు సహాయం చేసిన జమాల్‌ఖాన్‌కు పాయం దేవి కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి సంస్కృతికి నాంది పలికింది మీరే

**అనపర్తి–ఈమాట:**



నియోజకవర్గంలో గంజాయి సంస్కృతి వైఎస్సార్‌సీపీ హయాంలోనే పెరిగిందన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే డా. సత్తి సూర్యనా రాయణరెడ్డి ఖండించారు. 2014–19 మధ్య గంజాయి సంస్కృతి విచ్చలవిడిగా మారిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం అందుబాటులోకి వచ్చాయని, బెల్ట్‌షాపుల ద్వారా యువత భవిష్యత్తు దెబ్బతింటోందని విమర్శించారు. గొల్లల మామిడాడకు చెందిన కూటమి నాయకుడి గంజాయి వ్యవహారంపై సీసీటీవీ ఫుటేజీ, కాల్‌డేటా బహిర్గతం చేసి వాస్తవాలు తేల్చాలని సవాల్ చేశారు. గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడితే వైఎస్సార్‌సీపీ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.

## పొలమూరులో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

**అనపర్తి–ఈమాట:**
పొలమూరు గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.సురేష్ కుమార్ మాట్లాడుతూ వరి పంటకు ఎలుకల వల్ల తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం బ్రోమోడియోలోన్ 25%సిబి రోడెంటిసైడ్ మందును రైతులకు 100 శాతం రాయితీపై అందజేస్తోందని చెప్పారు. రైతులందరూ ఈ మందును సామూహికంగా ఒకేసారి వినియోగించడం ద్వారా ఎలుకలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని, తద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.

రైతులు వ్యవసాయ శాఖ సూచ నలను పాటించి ఎలుకల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తి దేవధాన రెడ్డి (బాబా), ద్వారం పూడి ఈశ్వరరెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, వ సంశెట్టి నాగేశ్వరరావు, రైతులు, రైతు సేవా కేంద్రంసిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**మండపేట–ఈమాట:**
మండపేట ప్రొఫెషనల్ ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైస్ చైర్మన్ చక్కా రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫోటోగ్రఫీ రంగం డార్క్‌రూమ్ నుంచి ఏఐ సాంకేతికత వరకు ఎంతో అభివృద్ధి చెందిందని రాంబాబు అన్నారు. ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ చింతా బాబుల్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గుర్రాల కృష్ణ, గౌరవ అధ్యక్షులు చిర్ల శ్రీనివాసరెడ్డి, సలహాదారు ముత్యాల వెంకటరావు, అధ్యక్షులు గంగుమళ్ల వెంకటేష్, ట్రెజరర్ దుప్పలపూడి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సామూహికంగా ఎలుకల మందు పంపిణీ



**అనపర్తి–ఈమాట:**
పంటలను ఎలుకల బెడద నుంచి కాపాడేందుకు మహేంద్రవాడ రైతు సేవా కేంద్రంలో రైతులకు సామూహికంగా ఎలుకల మందు పంపిణీ చేశారు. కూటమి నాయకులు సత్తి వెంకట సుబ్బారెడ్డి, పడాల చంటి రెడ్డి, గొలుగూరి రామకృష్ణారెడ్డి పాల్గొని, ఎలుకల నియంత్రణపై రైతులకు అవగాహన కల్పించారు. ముందస్తు చర్యలతో పంట నష్టాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## జడ్డంగి పీహెచ్‌సీ అభివృద్ధిపై హెచ్‌డీఎస్ సమావేశం

**రాజవొమ్మంగి–ఈమాట:**
జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధిపై ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం హెచ్‌డీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్య పరికరాల కొనుగోలు, ఆసుపత్రి పరిశుభ్రత, మౌలిక వసతులపై చర్చించారు. పీహెచ్‌సీ స్లాబ్ లీకేజీ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపీపీ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా వసతులు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎల్. యాదగిరి ఈశ్వరరావు, తహసీల్దార్ కే. స్వామి, వైద్యులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ పావని, సిబ్బంది పాల్గొన్నారు.



## పురోహితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**-ఎమ్మెల్యే నల్లమిల్లి**

**అనపర్తి–ఈమాట:**
రాష్ట్రంలోని పురోహితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో కోరారు. అసెంబ్లీ సమావేశాల రెండో రోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది పౌరోహిత్యాన్ని వృత్తిగా చేసుకుని జీవిస్తున్నప్పటికీ, తగిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహకారం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పురోహితుల సంక్షేమానికి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి, దాని ద్వారా వారికి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ మంత్రిని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు

## రహదారులపై అటవీ శాఖ క్షేత్ర పరిశీలన



**రాజవొమ్మంగి–ఈమాట:**
కిమ్మలగడ్డ–అమ్మిరేకుల, లోదొడ్డి–కిండంగి రహదారుల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ అధికారులు బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అటవీ అనుమతుల ప్రక్రియలో భాగంగా రహదారి మార్గాలను పరిశీలించారు. పోలవరం జిల్లా అటవీ అధికారి శివకుమార్ దంగల్, ట్రైనీ ఐఏఎస్ క్షితిజ్ ఆదిత్య శర్మ, సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి, అటవీ అధికారి గుమ్మడి ఉషారాణి, డీఈ గౌతమి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఎంపీటీసీ సుంద్రుల కుమారి పరిశీలించారు. కిమ్మలగడ్డ వద్ద సుమారు 900 మీటర్లు మాత్రమే అటవీ ప్రాంతం ఉందని, మిగిలిన సుమారు ఐదు కిలోమీటర్ల రహదారికి అటవీ శాఖ అభ్యంతరం లేదని సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి తెలిపారు. మొత్తం రహదారి అటవీ శాఖ కారణంగా నిలిచిపోయిందన్న ప్రచారం అవాస్తవమన్నారు. అనంతరం విద్యార్థులతో అధికారులు మాట్లాడారు. రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని డీఎఫ్ఓ శివకుమార్ దంగల్ తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

## నిర్వాసితులందరికీ ఒకే చోట పునరావాసం కల్పించాలి

**వి.ఆర్.పురం–ఈమాట:**
పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న గిరిజనేతర నిర్వాసిత కుటుంబాలను విడదీయకుండా, ఒకే ప్రాంతంలో పునరావాసం కల్పించాలని వి.ఆర్.పురం మండల వైస్ ఎంపీపీ భవాని అధికారులను కోరారు. వడ్డిగూడెం గ్రామస్తులకు వి.ఆర్.పురంతో పాటు తాడువాయి, కొయ్యలగూడెం ప్రాంతాల్లో పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రాజెక్టు అధికారులు ఇచ్చిన హామీ మేరకు గిరిజనేతర నిర్వాసితులందరికీ ఒకే చోట పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబాలు, బంధువులను వేర్వేరు ప్రాంతాలకు తరలించడం వల్ల వారి బంధాలు, అనుబంధాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. "మాది ఒక కులం కాదు.. ఒక కుటుంబం. మా బంధాలు ఉన్న ప్రాంతాల్లోనే మమ్మల్ని కలిపి పునరావాసం కల్పించాలి" అని భవాని కోరారు. వి.ఆర్.పురం, తాడువాయి, కొయ్యలగూడెం పరిసరాల్లో అవసరమైన ఇళ్లు నిర్మించి, నిర్వాసితులందరికీ ఒకే ప్రాంతంలో పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# గుంతల రహదారిపై గోపాలపురం గోడు!

-గోపాలపురం-ఇందుకూరుపేట రహదారి అస్తవ్యస్తం

-మూడు కిలోమీటర్ల మేర అధ్వాన స్థితి.. వర్షం పడితే చెరువులే!

-నిత్యం ప్రమాదాల ముప్పులో ప్రయాణికులు..

కొత్త రహదారి నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్





గోకవరం-ఈమాట:
ఇది రహదారినా.. గుంతల బాటా? గోకవరం మండలం గోపాలపురం నుంచి ఇందుకూరుపేటకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారి ప్రజలకు నరకయాతనను మిగుల్చుతోంది. రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు నిలిచిపోయి రహదారి చెరువులను తలపిస్తుండటంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. గోపాలపురం నుంచి ఇందుకూరుపేట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు గుంతలను తప్పించుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షం పడితే పరిస్థితి మరింత దారుణం

ఈ రహదారి దుస్థితికి వర్షాలు తోడవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. గుంతల్లో నీరు చేరడంతో వాటి లోతు తెలియక వాహనదారులు అదుపుతప్పే పరిస్థితి ఏర్పడుతోంది. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. సరైన వెలుతురు లేకపోవడంతో గుంతలు కనిపించక ప్రమాదాలకు గురయ్యే ముప్పు ఉందని పేర్కొంటున్నారు.

### అధికారులకు చెప్పినా పట్టించుకోరా?

రహదారి దుస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కొత్త రహదారి నిర్మాణానికి ఇదే సరైన సమయం

ప్రస్తుతం ఇటికాలపల్లి నుంచి గోపాలపురం వరకు నూతన రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు గుర్తుచేస్తున్నారు. అదే సమయంలో గోపాలపురం నుంచి ఇందుకూరుపేట వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారిని కూడా నూతనంగా నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజల రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే దెబ్బతిన్న రహదారిపై మళ్లీ చిన్నచిన్న మరమ్మతులు చేసి చేతులు దులుపుకోకుండా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలతో నూతన రహదారిని నిర్మించాలని వారు కోరుతున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో గోపాలపురం--ఇందుకూరుపేట రహదారి సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముందుగా సంబంధిత అధికారులు రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, గుంతలను తాత్కాలికంగా పూడ్చడంతో పాటు సుమారు మూడు కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. "ఇంకెంతకాలం ఈ గుంతల రహదారిపైనే ప్రయాణించాలి? ప్రమాదం జరిగి ప్రాణాలు పోయేలోపు అధికారులు స్పందించాలి. కొత్త రహదారి నిర్మించి మా కష్టాలు తీర్చాలి" అని గోపాలపురం, ఇందుకూరుపేట గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



## పునరావాస కాలనీ స్థల ఎంపికపై గ్రామసభ

వి.ఆర్.పురం-ఈమాట:
పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1బి పరిధిలోని వి.ఆర్.పురం గిరిజనేతర నిర్వాసితుల పునరావాస కాలనీ స్థల ఎంపికపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. సచివాలయం వద్ద జరిగిన సభలో ఎస్‌డీసీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాడ్వాయి ఆప్షన్‌ను 481 మంది, తిరువూరు ఆప్షన్‌ను 181 మంది ఎంచుకున్నారని తెలిపారు. మరో 120 మంది ఆప్షన్ ఇవ్వాల్సి ఉందని, బుధ, గురువారాల్లో తమ ఆప్షన్ ఫారాలు సమర్పించాలని కోరారు. తాడ్వాయి ఆప్షన్ ఎంచుకున్న నిర్వాసితులను ముందుగా సర్దుబాటు చేస్తామని, తిరువూరు ఆప్షన్ ఎంపిక చేసుకున్న వారికి అనంతరం చర్యలు చేపడతామని తెలిపారు. తాడ్వాయిలోని పునరావాస స్థలాలను మ్యాప్ ద్వారా చూపించారు. అయితే స్థలాలను ప్రత్యక్షంగా చూపించిన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని నిర్వాసితులు కోరగా, తప్పనిసరిగా చూపిస్తామని ఎస్‌డీసీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వై. సరస్వతి, యటపాక సీఐ కృష్ణ, ఎస్ఐ షేక్ సాదిక్, వీఆర్వో భవాని, నిర్వాసితులు పాల్గొన్నారు.

## ముసురుమిల్లిలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల పరిశీలన



రంపచోడవరం-ఈమాట:
ముసురుమిల్లి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఎంపీటీసీ వంశీ కుంజం ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందుతున్నదీ లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. గ్రామ సచివాలయంలో ఉత్తమ ఉద్యానవన సహాయకురాలి అవార్డు పొందిన సౌజన్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలురెడ్డి నాగేశ్వరరావు, బొబ్బా శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 59 కుటుంబాలకు మిషన్ వాత్సల్య ఆర్థిక భరోసా




జగ్గంపేట-ఈమాట:
మిషన్ వాత్సల్య పథకం లబ్ధిదారులతో జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్. వెంకట్రావు మాట్లాడుతూ అనాథ, పాక్షిక అనాథ, హెచ్ఐవీ ప్రభావిత, కోవిడ్ బాధిత కుటుంబాల 18 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలో 59 కుటుంబాలకు నెలకు రూ.4,000 చొప్పున సహాయం అందుతోందని సీడీపీఓ ఎం. పూర్ణిమ తెలిపారు. లబ్ధిదారులు ఈ మొత్తాన్ని పిల్లల విద్య, వైద్యం, పోషణకు వినియోగించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సంరక్షణ అధికారులు కె. శ్రీనివాస్, జాగరపు విజయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు దుర్గాదేవి, చైల్డ్ సైకియాట్రిస్ట్ కృష్ణ శ్రీనివాసమ్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, కేస్ వర్కర్ నరేష్, ఐసీడీఎస్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం



మండపేట-ఈమాట:
బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై మండపేట నియోజకవర్గ కూటమి బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యాలయం నుంచి వేగుళ్ల వీర్రాజు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల రాజకీయ సాధికారతకు నిర్ణయం కీలకమన్నారు. గత ప్రభుత్వంలో 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని ఆరోపిస్తూ, కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు.

# సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన



జగ్గంపేట-ఈమాట:
జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగ్గంపేట ఎస్ఐ టి. రఘునాథరావు విద్యార్థులకు సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. విద్యార్థులు అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని హెల్మెట్ ధరించాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ ఫౌండేషన్ ప్రతినిధి బి.కె. హేమ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనారోగ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. డి. సత్యలత, సి.హెచ్. బాలరాజ్, డా. పి.వి.వి. సత్యనారాయణ, జి. సురేష్, పి. పద్మశేఖర్, వి. దేవి ప్రసన్న, పి. శ్రీనివాసరావు, ఆర్. శ్రీను తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎలుకల నివారణకు రైతులు సమష్టిగా చర్యలు చేపట్టాలి




రంగంపేట-ఈమాట:
వరి పంటకు ఎలుకల వల్ల నష్టం జరుగుతున్నందున రైతులంతా సమష్టిగా నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కే. శ్రీనివాస్ సూచించారు. రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలుకల బొరియలను గుర్తించి శాస్త్రీయ పద్ధతిలో ఎరమిశ్రమం వినియోగించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరమిశ్రమాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఒకేసారి చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఆసుపత్రి కమిటీ సభ్యుడు యాలమాటి రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకుడు ఉండవల్లి గంగాధర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పోతుల చిన్ని కాపు, మండవిల్లి గుప్తా మల్లిబాబు, అంచురి సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు, ఎయిడ్స్‌పై అవగాహన

అనపర్తి-ఈమాట:
మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, హెచ్ఐవీ-ఎయిడ్స్ నివారణపై అనపర్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనల ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎయిడ్స్‌పై అపోహలు వీడి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, వైద్యులు డాక్టర్ తరుణ్, డాక్టర్ సుశీల, నర్సింగ్ సూపరింటెండెంట్ కనకదుర్గ, అభివృద్ధి కమిటీ సభ్యుడు డీకే దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండపేట-ఈమాట:



అక్టోబర్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపీడీవో కే. సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో టి. శ్రీనివాస్ వెలగతోడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్, ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, గదుల విస్తీర్ణం తదితర వసతులను తనిఖీ చేసి వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సొంటేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉంగరాల వీరభద్రరావు, నెక్కంటి రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కే. సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ శ్యాంప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ త్రినాథ్ పాల్గొన్నారు.

## బీసీలకు గుర్తింపు ఇచ్చింది జగనే

మండపేట-ఈమాట:
బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా అన్నారు. రిజర్వేషన్ల పేరుతో టీడీపీ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించామని, బీసీలపై చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వారిని రాజ్యసభకు పంపేవారని విమర్శించారు.

## మండలిలో డీఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

తిరస్కరించిన ఛైర్మన్..కాసేపు మండలి వాయిదా

అమరావతి,ఆగస్టు19(ఆరఎనఎ):
ఏపీ అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఛైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు నినాదాలు చేస్తున్నారని ప్రశ్నించారు. సభా మర్యాద కాపాడాల్సిన బాధ్యత సభ్యులపైనా ఉందని తెలిపారు. మనోహర్ వ్యాఖ్యలపై ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. సభా నిర్వహణ, నిబంధనల గురించి వికు బాగా తెలుసు అని అన్నారు. వారిపై ఎలాంటి చర్యలు ఎలా తీసుకోవాలో వికు తెలుసునని చెప్పారు. సభ సంప్రదాయాల ప్రకారం జరగాలని ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్ హయాంలో కూడా విరు ఛైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. రెడ్ లైన్ గీసి విపక్షాల వాళ్లు దాటి వస్తే సస్పెండ్ చేశారని ప్రస్తావించారు. ఇప్పుడు కూడా అలాగే చేసేందుకు వికు అధికారాలున్నాయని తెలిపారు. మడు రోజులుగా సభకు అంతరాయం కలిగిస్తుంటే చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. ఛైర్మన్‌ను కించపరచాలనే ఆలోచన తమకు లేదని.. ఆయనకు పవర్స్ ఉన్నాయని చెప్పారు.

# బీసీ 139 కులాలకు సర్పంచ్ అవకాశమివ్వాలి

కాకినాడ-ఈమాట:
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి, 139 బీసీ కులాలకు సర్పంచ్‌లయ్యే అవకాశం కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు కోరారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలాన్ని కాకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు నిర్ణయించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని మధు కోరారు. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేషన్ కమిటీ సిఫారసులను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి

-ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్



కేసముద్రం–ఈమాట:

ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గృహం, వంటగది, భోజనశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే మురళి నాయక్ నేరుగా మాట్లాడి వారి చదువు, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతను పరిశీలించి, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు చదువులో ముందంజలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళి నాయక్ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మహిళ మృతి

మహబూబాబాద్ రూరల్–ఈమాట:

మహబూబాబాద్ మండలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన పాత రెడ్యాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంటి వద్ద బైండింగ్ తీగకు తడి బట్టలు ఆరేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో ఆమె విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి కిందపడిపోయింది. తల్లిని రక్షించేందుకు ఆమె కుమారుడు ప్రయత్నించగా అతనికి కూడా విద్యుత్ షాక్ తగిలింది. అయితే కొడుకు స్వల్ప ప్రమాదంతో బయటపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి క్షతగాత్రురాలిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో పాత రెడ్యాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సీఎం తండాలో విషాదం..

మహబూబాబాద్ రూరల్–ఈమాట:

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సీఎం తండాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు పురుగుమందు తాగిఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 5వ వార్డుకు చెందిన మహిళ, ఆమె భర్త మధ్య చిన్నపాటి వివా దం చోటుచేసుకుంది. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనైన మహిళ పురుగుమందు తాగగా తన తరఫున బంధువులు గొడవ చేస్తారనే భయంతో అయన కూడా పొలం వైపు వెళ్లి పురుగుమందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వీరు ఆచూకీ కోసం గ్రామస్తులు గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తప్పిన పెను ప్రమాదం

ఏలూరు, ఈమాట:

ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సమీపంలో బుధవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఏపీఎసఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోగా, అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను మరో ఆర్టీసీ బస్సులో తరలించాడు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం వైపు పంపించిన డ్రైవర్, వాహనం రిపేర్ కోసం బస్సును రోడ్డు మార్జిన్ వైపు నిలపగా, అదే సమయంలో బస్సును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ప్రమాదపు అంచుల్లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు ప్రయాణీకులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు హైవే పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు బస్సును ఢీకొట్టి తప్పించుకుపోయిన కంటైనర్‌ను స్వాధీనపర్చుకుని. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు పోలీసులు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకేసు

పాఠశాల విద్యార్థులే హంతకులుగా నిర్ధారణ

నల్గొండ, ఈమాట:

కొండమల్లెపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి హత్య ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న జరిగిన ఈ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మిస్టరీని ఛేదించారని సమాచారం. ఈ దారుణానికి పాల్పడింది అదే పాఠశాలలో చదివిన వంశీ, అనిల్ అనే విద్యార్థులే అని విచారణలో తేలినట్లు సమాచారం. డబ్బుల కోసం ఆశపడే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం నిందితులు గోవాకు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ కేసులో విద్యార్థుల ప్రమేయం ఉండటం స్థానికంగా దిగ్భ్రాం–రతిని కలిగించింది. సుమారు 80 మందిని విచారించిన అనంతరం ఆ విద్యార్థులే ఈ దారుణానికి పాల్పడ్డారని గుర్తించినట్లు సమాచారం. రూపారెడ్డి హత్య అనంతరం ఆ విద్యార్థులు సుమారు రూ.4 లక్షల నగదు చోరీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయదుర్గం పోలీసులకు కోర్టు నోటీసులు

హైదరాబాద్, ఈమాట:

పోక్సో కేసులో నిందితుడిని వేధించి చిత్రహింసలకు గురిచేశారన్న ఆరోపణల నేపథ్యంలో రాయదుర్గం పోలీసులకు రాజేంద్రనగర్ కోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్ సమయంలో నిందితుడి ఒంటిపై గాయాలను న్యాయవాది కోర్టుకు చూపించారు. దీంతో రాజేంద్రనగర్ కోర్టు తక్షణమే నిందితుడిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. నిందితుడిని వేధింపులకు గురిచేసిన అంశంపై షోకాజ్ నోటీసులు జారీచేసింది.





# రైతులకు సాంకేతిక అండగా ఇన్‌పుట్ డీలర్లు

-39 మందికి శిక్షణ సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ అంకిత్

చుంచుపల్లి–ఈమాట:

రైతులకు వ్యవసాయ సాంకేతిక సహాయకులుగా ఇన్‌పుట్ డీలర్లు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. బుధవారం చుంచుపల్లి రైతు వేదికలో దేశీ శిక్షణ పూర్తి చేసుకున్న 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్లు అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సుమారు 37 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకునేలా రైతులకు సూచించాలని అన్నారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, మిరప తదితర ప్రత్యామ్నాయ పంటలతో పాటు పంటల మార్పిడి, భూసార పరిరక్షణ, నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుడిపాటి విజయభాస్కర్‌కు గోల్డ్ మెడల్, అనగారి కళ్యాణ్‌కు సిల్వర్ మెడల్ రావడంపై కలెక్టర్ అభినందించారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు.

### తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

అనంతరం చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులను దరఖాస్తుల వారీగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే పరిష్కరించాలని స్పష్టం చేశారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను కూడా నిర్ణీత కాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగంగా రెవెన్యూ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిణి, ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు, ఏవోలు, ఇన్‌పుట్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి,ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


-ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్

కేసముద్రం–ఈమాట:

మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎంఎల్ఏ డా.భూక్యా మురళి నాయక్ కేసముద్రం, ఇనుగుర్తి, గూడూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రతి శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మురళి నాయక్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటికి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధినియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మురళి నాయక్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశాల్లో ఆయా మండలాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

-మ్యాపింగ్ కాని, వ్యత్యాసాలున్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి

-జిల్లాలో 1.80 లక్షల వ్యత్యాసాలు.. 60,206 నో మ్యాపింగ్ ఓటర్లు

కొత్తగూడెం–ఈమాట:

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మ్యాపింగ్ కాని, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పాల్గొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పరిశీలన అనంతరం మ్యాపింగ్ కాని, వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన ధ్రువపత్రాలతో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

### జిల్లాలో 2.40 లక్షలకుపైగా గుర్తింపులు

జిల్లాలో 1,80,229 వివరాల వ్యత్యాసాలు, 60,206 మ్యాపింగ్ కాని ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా పినపాకలో 39,670 వ్యత్యాసాలు, 16,421 నో మ్యాపింగ్; ఇల్లెందులో 37,660, 5,656; కొత్తగూడెంలో 46,743, 23,428; అశ్వారావుపేటలో 28,994, 7,361; భద్రాచలంలో 27,162, 7,340 ఉన్నట్లు వివరించారు. ఎస్ఐఆర్‌లో ప్రతి దశను అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని సీఈఓ ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

హైదరాబాద్, ఈమాట:

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061 కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

## రూపారెడ్డి హత్య కేసులో సంచలన విషయాలు

హత్యకు పాల్పడింది ..అదే స్కూల్‌లోని ఇద్దరు టెన్త్ స్టూడెంట్స్

జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య

వివరాలు తెలియడంతో విస్తుపోయిన టీచర్లు, స్టూడెంట్స్

నల్గొండ, ఈమాట:

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటకు రావడంతో తోలి విద్యార్థులు,టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతారని అనుకోలేదని అంటున్నారు. ఈ నెల 11న కొండమల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా.. ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో రూపారెడ్డిని పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.2.20లక్షలు తీసుకుని బయట ఉన్న మరో విద్యార్థికి రూ.40వేలు ఇచ్చాడు. ఇద్దరు విద్యార్థులు చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. విచారణ సమయంలో విద్యార్థి జేబులో ఉన్న రూ.1.60లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు రక్తపు మరక ఉండటాన్ని గుర్తించారు. రక్తపు మరకలపై ప్రశ్నించడంతో విద్యార్థులు నిజం అంగీకరించారు.

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పంటల వైవిధ్యీకరణ



వాజేడు–ఈమాట:

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జొన్న, చిరుధాన్యాలు, వేరుశనగ, పెసర, మినుములు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుపై సూచనలు చేశారు. పంటల వైవిధ్యీకరణతో నీటి వినియోగం తగ్గడంతో పాటు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. నీటి పొదుపు పద్ధతులు పాటించి ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

## త్యాగం మీది.. అండ మాది

వెలిగొండ నిర్వాసితులకు

మరో రూ.200 కోట్ల పరిహారం

నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన

ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

అమరావతి, ఈమాట:

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ. 200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు. రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినటట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

"This newspaper/periodical is published by THOTAMALLA **VENKATA BALAYOGI** from 18-1-192, LAMBADI COLONY, BHADRACHALAM, BHADRADRI KOTHAGUDEM, TELANGANA-50711 on behalf of **THOTAMALLA VENKATA BALAYOGI**, edited by THOTAMALLA VENKATA BALAYOGI and printed by DHANDYALA GAYATHRI DEVI at DHANDYALA GAYATHRI DEVI at 7-32/4, SAI BABAASRAMAM BACK SIDE, SAI PRABHATH NAGAR, BLOCK PEDDA THANDA, KHAMMAM, TELANGANA-507003